క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన తూమాటి



ముఖ్యమంత్రి జగన్‌తో ఎమ్మెల్సీ తూమాటి

కందుకూరు: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ లాబీల్లో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్సీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

గుంటూరు వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేత



అచ్చమ్మకు గుంటూరు వైద్యశాలలో పెన్షన్ ఇస్తున్న వలంటీర్ వెంకటయ్య

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన చల్లగాలి అచ్చమ్మ గుండె సంబంధిత ఇబ్బందులతో వారం రోజులుగా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈ సందర్భంగా ఆమెకు అదే గ్రామానికి చెందిన వలంటీర్ అంగ్రా వెంకటయ్య పింఛన్ నగదు రూ.3 వేలను సోమవారం గుంటూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి అందజేశాడు. వలంటీర్ వెంకటయ్యకు అచ్చమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

మున్సిపల్ స్పందనకు 7 అర్జీలు

కందుకూరు: స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 7 ఫిర్యాదులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తెలిపారు. వీటిలో పలు వ్యక్తిగత సమస్యలతో పాటు, రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ పథకాలకు సంబంధించి ఉన్నట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను వీలైనంత త్వరగా ఆయా విభాగాల వారీగా పరిష్కరిస్తామన్నారు. స్పందనకు రాలేని ప్రజలు 9177700267 నంబర్‌కు ఫోన్‌చేసి చెప్పవచ్చునని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం: మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆంగ్ల మాధ్యమంలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.స్నేహలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు అర్హులని, ఈ నెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పారదర్శకంగా కులగణన సర్వే

జరుగుమల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.జలజాక్షి ఆదేశించారు. మండలంలోని చింతలపాలెం సచివాలయ పరిధిలో కులగణన సర్వేను సోమవారం ఆమె పరిశీలించారు. సచివాలయ పరిధిలోని వలంటీర్లు అందరూ సర్వేలో పాల్గొనాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలి

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణం వలన ఇళ్లు కోల్పోతున్న వారికి వెంటనే ఇళ్ల స్థలాలను కేటాయించాలని కర్లపాలెం గ్రామస్తులు తెలిపారు. ఇళ్ల స్థలాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కర్లపాలెం గ్రామస్తులు పోర్టు వద్ద సోమవారం నిరసన చేపట్టారు. పోర్టులో జరుగుతున్న నిర్మాణ పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మీరయ్య, రమణయ్య, శేషయ్య, గ్రామ కాపులు మాట్లాడుతూ కర్లపాలెం గ్రామస్తులకు పొలాలకు నష్టపరిహారం మాత్రమే అందించి ఇళ్ల స్థలాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఐవీ.రెడ్డిలు అక్కడకు చేరుకొని గ్రామస్తులుతో చర్చలు చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పోర్టు నిర్మాణ పనులకు ఆటంకం కలిగించవద్దన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తులు సాధించాలి



పొగాకు ఉత్పత్తులను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

కందుకూరు: ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తిపై రోజు రోజుకు పెరుగుతున్న ఆంక్షలు, తరిగిపోతున్న మార్కెట్ దృష్ట్యా పొగాకు రైతులు అంతర్జాతీయ ప్రమాణాలు ఉన్న నాణ్యమైన పొగాకు ఉత్పత్తులను పండించేందుకు కృషి చేయాలని పొగాకు బోర్డు ఆర్‌ఎం ఎం లక్ష్మణరావు అన్నారు. రెండో పొగాకు వేలం కేంద్రం పరిధిలోని ఆదర్శ గ్రామమైన యర్రారెడ్డిపాలెం గ్రామంలో రైతులకు ఉత్పత్తి, ఆకురెలుచుట, క్యూరింగ్, గ్రేడింగ్, బేళ్ల కట్టుట వంటి విషయాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ప్రమాణాలు ఉన్న పొగాకును ఉత్పత్తి చేసేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. అన్య పదార్థాలు, క్రిమిసంహారక మందులు లేని పొగాకును ఉత్పత్తి చేయాలని సూచించారు. దీని వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ పొగాకు బ్రాండ్ విలువ రెట్టింపు అవుతుందని, నాణ్యమైన పొగాకుకు వ్యాపారులు బారులు కడతారని చెప్పారు. అంతర్జాతీయ వ్యాపారులు పొగాకు కొనుగోలు చేసే సమయంలో బేళ్ల కట్టు విధానంతోనే ఆకర్షితులవుతారని, దీనికి అనుగుణంగా రైతులు మంచి గ్రేడింగ్‌తో బేళ్ల చక్కగా కట్టుకోవాలని సూచించారు. పొగాకు సాగులో నిష్ణాతులైన రైతులు వారికి ఉన్న అనుభవాన్ని కొత్తగా పొగాకు సాగు చేసే యువ రైతులతో పంచుకోవాలని, సాగులో వారికి మెళకువలు నేర్పాలని వివరించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి కె.రాజగోపాల్‌రెడ్డి, ఐటీసీ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీహర్ష, ఐటీసీ, పీఎస్ఎస్ మేనేజర్లు ప్రవీణ్‌బాబు, ఏ రామాంజనేయులు, సీటీఆర్ఐ టెక్నికల్ ఆఫీసర్ దీప్తి, టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



నాగమల్లేశ్వరావు



సుధాకర్‌రావు



రామయ్య



కిరణ్‌కుమార్



చక్రవర్తి

టంగుటూరు/జరుగుమల్లి: ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా వివిధ మండలాలకు కేటాయించిన తహసీల్దార్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సింగరాయకొండ తహసీల్దార్‌గా విధుల్లో చేరిన శంకాల రామయ్యకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తిరుపతి జిల్లా పెళ్లకూరు నుంచి బదిలీపై రాగా ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సీహెచ్ ఉష పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నియమితులయ్యారు.

కొండపి తహసీల్దార్‌గా బి.కిరణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన పల్నాడు జిల్లా వినుకొండ మండలం నుంచి బదిలీపై రాగా ఇక్కడ పనిచేస్తున్న బి.సింగారావు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏఓగా నియమితులయ్యారు. నూతన తహసీల్దార్‌కు కార్యాలయం సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

జరుగుమల్లి: మండల నూతన తహసీల్దార్‌గా కేఎస్ చక్రవర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి బదిలీపై రాగా ఇక్కడ పని చేస్తున్న ఎస్.ఉషారాణి పల్నాడు జిల్లా రొంపిచర్లలో నియమితులయ్యారు.

పీసీపల్లి: తహసీల్దార్‌గా పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రైతుల భూసమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆర్డీఓను కలిసి మొక్క అందజేశారు.

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం తహసీల్దార్‌గా ఎంవీకే సుధాకర్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారాంపురం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో సీఎస్‌పురం తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తానని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు.

తహసీల్దార్‌గా హేమంత్ కుమార్ బాధ్యతల స్వీకరణ

వెలిగండ్ల: తహసీల్దార్‌గా పసుపులేటి హేమంత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఈయన నెల్లూరు జిల్లా నుండి ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఎన్ వాసు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

వలేటివారిపాలెం: తహసీల్దార్‌గా నాగమల్లేశ్వరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీలో భాగంగా వలేటివారిపాలెం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సర్వే జరుగుతున్న గ్రామాల్లో కానీ భూ సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికి తీసుకొస్తే సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ కె.సుందరమ్మ బదిలీపై మర్రిపూడి మండలానికి వెళ్లారు.

నేడు ఎమ్మెల్యే రాక

హనుమంతునిపాడు: ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నూతన ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మండలానికి రానున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జరగనున్న వైఎస్సార్ ఆసరా నగదు చెక్కుల పంపిణీలో పాల్గొంటారన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షునిగా శ్రీనివాసులు

గుడ్లూరు: ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా మండలంలోని కొత్తపేట ఏపీపీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జనిగర్ల శ్రీనివాసులు ఎన్నికైనట్లు మండల శాఖ అధ్యక్షుడు కుంచాల వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి నెల్లూరులో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గుడ్లూరు మండలం నుంచి జనిగర్ల శ్రీనివాసులు ఉపాధ్యక్షుడుగా, కొరివి నాగేశ్వరరావు ఆడిట్ కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు వేణుగోపాల్ చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గుండ్లపాలెం వద్ద ఉన్న మన్నేరు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణరావు తన సిబ్బందితో గుండ్లపాలెం అడ్డ రోడ్డు వద్ద కాపు ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ బళ్లారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

వెలిగండ్ల: వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఏపీఎం ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ పాల్గొంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రూపు సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

ఎస్టీయూ మండల అధ్యక్షునిగా శ్రీనివాసరావు

పీసీపల్లి: ఎస్టీయూ మండల శాఖ ఎన్నికలు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా సైకం శ్రీనివాసరెడ్డి , కొండయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ మండల అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ప్రధాన కార్యదర్శిగా పి.రమణారెడ్డి, కోశాధికారిగా వెంకయ్య, జిల్లా కౌన్సిలర్‌గా మోహన్ రావు, షేక్ మహబూబ్ బి.గురవయ్యలను ఎన్నుకున్నారు.

నేడు ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పెదరాజుపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఉచిత వైద్య శిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని డాక్టర్ సందిరెడ్డి మురళి తెలిపారు. వైద్యశిబిరాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలి



గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

గుడ్లూరు: కుష్టు వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా లెప్రసి, టీబీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఖాదర్‌వలీ సోమవారం తనిఖీ చేశారు. వైద్యశాలలో లెప్రసి, టీబీ రోగులకు సంబంధించిన రికార్డులను, మందుల రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి రాకుండా 60 ఏళ్లు దాటిన వారికి ఈ నెలలో బీసీజీ వ్యాక్సినేషన్ వేస్తామన్నారు. కార్యక్రమంపై అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే ఎవరికైనా చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే వారి వివరాలు నమోదు చేసి వైద్యశాలకు పంపించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు అందజేయాలన్నారు. కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్,వైద్యాధికారిమారుతీరావుపాల్గొన్నారు.

డీఎస్పీగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



డీఎస్పీకి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కందుకూరు: కందుకూరు పోలీస్ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా ఇటీవల నియమితులైన ఆముదాల శ్రీనివాసరావు సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ రామచంద్రను ఒంగోలు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో నూతన డీఎస్పీగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు డీఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రేణమాల అయ్యన్న, గణేశం గంగిరెడ్డి, రహీం, బికారి, శివకృష్ణ, జిలానీ, మహిళా నాయకురాలు ఆదిలక్ష్మి, కామాక్షినాయుడు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో జీర్ణోద్ధరణ



పార్వతీ అమ్మవారి విగ్రహాన్ని ధాన్యాసివాసంలో పెడతానికి తీసుకెళుతున్న భక్తులు



విగ్రహాల కింద బయటపడిన రాగి, వెండి నాణెలు

గుడ్లూరు: స్థానిక పురాతన నీలకంఠేశ్వర ఆలయంలో విగ్రహాల జీర్ణోద్ధరణను సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇప్పుడున్న నీలకంఠేశ్వర ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నందున ఆలయ నిర్వహణాధికారులు, కమిటీ సభ్యులు ఆలయంలో ఉన్న గంగాపార్వతి అమ్మవారి విగ్రహం, గణపతి విగ్రహం, చండీశ్వర విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ నుంచి తొలిగించి ధాన్యాసివాసంలో ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వడ్లను తీసుకొని వచ్చి ధాన్యాసివాసంలో వేశారు. గణపతి విగ్రహం, ధ్వజస్థంభాలను తొలగిస్తుండగా వాటి కింద 515 పురాతన రాగి, వెండి నాణెలు లభించినట్లు ఆలయ ఈఓ రామక్రిష్ణ తెలిపారు. త్వరలో నూతన ఆలయ నిర్మాణంకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.విశ్వనాథం, డి.సోమానాయుడు, రాఘవులు, వెంకటేశ్వరాజు తదితరులు పాల్గొన్నారు.

జహంగీర్ మలాంగ్‌షా దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే



దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: పట్టణంలోని వెంకటనారాయణ బజార్‌లో ఉన్న హజరత్ సయ్యద్ జహంగీర్ మలాంగ్ షా అవులియా గంధ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. దర్గాను సుందరంగా అలంకరించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొని, జహంగీర్‌మలాంగ్‌షా దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.

వల్లూరమ్మ ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాలు

టంగుటూరు: హిందూ ధర్మ పరిరక్షణార్థం, ఆలయ సంస్కృతిని ప్రజలందరికీ తెలియజేయడం కోసం ఆలయాలను కేంద్రంగా చేసుకుని దేవదాయ శాఖ అంకితభావంతో ధర్మప్రచారం నిర్వహిస్తోందని వల్లూరమ్మ ఆలయ ఈఓ బి.రమేష్ తెలిపారు. వల్లూరమ్మ దేవస్థానంలో గోపూజ, కుంకుమార్చనలు, భజన సంకీర్తనలు, 7న మడనూరు పర్వతమర్ధిని, జ్వాలాముఖి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, కోలాటం, 8న తూర్పునాయుడుపాలెంలోని చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో పూజలు, అష్టోత్తర పూజలు, కూచిపూడి నృత్య ప్రదర్శన, 9న వల్లూరమ్మ దేవస్థానం, సోమేశ్వరస్వామి ఆలయంలో గోపూజా, కుంకుమార్చనలు, పల్లకి సేవ, 10న కారుమంచిలోని కాశీ విశ్వేశ్వర స్వామివారి లో ప్రత్యేక పూజలు, 11న ప్రత్యేక పూజలు, అష్టోత్తర పూజలు, భక్తి సంగీతం, 12న టంగుటూరు నాగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



దద్దాల నారాయణయాదవ్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

దద్దాలతో పలువురు నేతల భేటీ

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ పట్టణంలోని పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో సోమవారం భేటీ అయ్యారు. కౌన్సిలర్లు దేవకి సత్యావతి, రంగయ్య, నక్కా ఉమా రామకృష్ణాలను, బసిరెడ్డి పిచ్చిరెడ్డిలతో పాటు మరికొందర్ని డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ కలిసి వారి మద్దతును కోరారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మనంతా సమష్టిగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కనిగిరి కోటపై తిరిగి వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేసి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అందించిన సంక్షేమ లబ్ధిని ప్రతి ఇంటి వివరించి, ఫ్యాను గుర్తుకు ఓటు వేయించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్కే ఖాశిం సాహెబ్, కోఆప్షన్ సభ్యులు చింతం శ్రీనివాసుల యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, నాయకులు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను సన్మానించారు.

వైఎస్సార్ సీపీకి పాస్టర్ల మద్దతు



మంత్రి సురేష్‌కు మద్దతు తెలుపుతున్న పాస్టర్లు

మర్రిపూడి: వైఎస్సార్ సీపీకి కొండపి నియోజకవర్గ పాస్టర్ల కమిటీ మద్దతుగా నిలిచింది. మర్రిపూడి షిలోహూ ప్రార్థన మందిరంలో సోమవారం నియోజకవర్గ పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యదర్శి, ప్రధాన కార్యదర్శులు ఇండ్ల కోటేశ్వరరావు, ఎం.అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాస్టర్లను ఆదుకున్నారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కొండపి నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను నియమించడం సంతోషంగా ఉందని, ఆయనకు కొండపి నియోజకవర్గ పాస్టర్ల కమిటీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో మంత్రి ఆదిమూలపు సురేష్ గెలుపు కోసం తమ వంతు కృషి చేసేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు రమేష్, జాన్‌మోజేష్, కోంద్రు శ్యాంబాబు, స్టీఫెన్‌పాల్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ప్రభావతి



డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న రాపూరి ప్రభావతి

సింగరాయకొండ(టంగుటూరు): వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ రాపూరి ప్రభావతి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్‌పర్సన్ బత్తుల సుప్రజ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తనకు పదవి రావడానికి సహకరించిన డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, చుక్కా కిరణ్‌కుమార్, చొప్పర వెంకన్న, జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి పాలూరి శ్రీనివాసులరెడ్డి, కొక్కిలిగడ్డ హనుమంతరావు, సుదర్శి వెంకట్రావు, చిమట బాలాజీ పాల్గొన్నారు.

సమన్వయంతో పట్టణాన్ని అభివృద్ధి చేద్దాం



కమిషనర్ డానియల్ జోసఫ్‌ను సన్మానిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు

కనిగిరి రూరల్: సమన్వయంతో పనిచేసి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేద్దామని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, నూతన కమిషనర్ డానియల్ జోసఫ్ అన్నారు. కనిగిరి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా డానియల్ జోసెఫ్ సోమవారం బాధ్యతలు స్వీరించారు. ఈ మేరకు కమిషనర్ డానియల్ జోసఫ్‌ను స్థానిక చైర్మన్ చాంబర్‌లో మున్సిపల్ పాలక వర్గం, కమిషనర్ ఆఫీసులో మున్సిపల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పట్టణంలోని పలు అభివృద్ధి అంశాలు, తక్షణం చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రణాళికాబద్ధమైన చర్యలు తదితర అంశాల గురించి చర్చించారు. వైస్ చైర్మన్లు పులికాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, వేల్పుల వెంకటేశ్వర్లు, దేవకి రాజీవ్, దేవరాజ్, దాసరి మురళి, ఎస్కే ఖాశింసా, తిరుపతయ్య, రామనబోయిన శ్రీను, పులి శ్రీనివాసులరెడ్డి, షఫీ ఆజాద్, దేవకి రంగయ్య, సయ్యద్ రిజ్వానా ఖాలక్, కోఆప్షన్ సభ్యులు ఎస్కే ఖాజా, జి.అబ్రహం లింకన్, చింతం శ్రీను, సిరుప గోవర్ధన్‌రెడ్డి, టి.శ్రీరాములరెడ్డి, మేనేజర్ ప్రసాద్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



అవార్డు గ్రహీత సురేష్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

పొన్నలూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రతి ఒక్కరికీ మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్‌వీ సురేష్‌బాబుకు జిల్లా ఉత్తమ అవార్డు రావడంతో సోమవారం ఆత్మీయ అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సురేష్, రజనీదేవి దంపతులను పాఠశాల సిబ్బంది శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవిచంద్రబాబు, హరిబాబు, హెచ్‌ఎం వెంకట్రావు, పల్లపోతు రమేష్, కొండపి విశ్వేశ్వరరావు, ముళ్లమూరి వెంకటేశ్వర్లు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజారావు, నాజర్‌లకు ఘన నివాళి

పామూరు: ఆంధ్ర ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు, కళాతపస్వి డాక్టర్ గరికపాటి రాజారావు, బుర్రకథ పితామహుడు, పద్మశ్రీ షేక్.నాజర్‌ల జయంతి వేడుకలు సోమవారం మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం షేక్.మహబూబ్‌బాషా అధ్యక్షతన నిర్వహించారు. కళాతపస్వి డాక్టర్ గరికపాటి రాజారావు, పద్మశ్రీ షేక్.నాజర్‌ల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కళ ప్రజాచైతన్యం కోసమేనని నమ్మి జీవితాన్ని కళకే అంకితం చేసిన ప్రజా కళాకారుడు, ప్రజావైద్యుడు డాక్టర్ గరికపాటి రాజారావు అన్నారు. వివిధ కళాసంస్థలను, కళాకారులను ఒకే వేదికపైకి తెచ్చి ప్రజానాట్యమండలి స్థాపించారన్నారు. అదేవిధంగా ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, ఎన్నో ప్రదర్శనల ద్వారా బుర్రకథ పితామహుడుగా నాజర్ కీర్తి గడించి సమాజాన్ని మేల్కొలిపారన్నారు. ఉపాధ్యాయులు తోట రమేష్, బి.కోటేశ్వరరావు, ఎస్.వి.ప్రసాద్, వి.వెంకటేశ్వరరావు, నీరజ, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులు పంపిణీ

సింగరాయకొండ(టంగుటూరు): సింగరాయకొండ మండలంలోని శానంపూడి, కలికవాయ, కనుమళ్ల గ్రామాల్లో సోమవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌అలీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కార్డు పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని పేర్కొన్నారు. ఏఎన్‌ఎంలు పరంజ్యోతి, కళ్యాణి, సాయిశ్రీ, గ్రామ వలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.